క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

సంగారెడ్డి టౌన్: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి మండల పరిధిలోని ఎంఎన్ ఆర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించనివారికి, హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానాలు విధించారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు 40 బస్సులు అవసరం

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు పోలింగు సిబ్బంది, ఎన్నికల సామగ్రిని తరలించేందుకు 40 ఆర్టీసీ బస్సులు, రెండు డీజీటీ బస్సులు అవసరమని ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి తెలిపారు. ఖేడ్ మండలం జూకల్ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్‌సెల్ ఇన్‌చార్జి పాండు, ప్రిసైడింగ్ అధికారి కళింగ కృష్ణకుమార్, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎన్నికలకు అవసరమయ్యే ఆయా బస్సులను సమకూర్చాలని కోరగా అందుకు డీఎం అంగీకరించారు.

సుందరవనం పార్కులో అగ్ని ప్రమాదం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని సుందరవనం పార్కులో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పార్కులో పెద్ద పెద్ద వెదురు చెట్లు ఉన్నాయి. గురువారం ఒక్కసారిగా చెట్లకు మంటలు వ్యాపించడంతో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. బెల్ సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై బెల్ యాజమాన్యం ఆరా తీస్తోంది.

వరిధాన్యం కొనుగోలు ప్రారంభం

కంది(సంగారెడ్డి): కంది వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలులు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ఇంద్రకరణ్, కందిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఇందిరా క్రాంతిపథం(ఐకేపీ)ఆధ్వర్యంలో కలివేములలో మరో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు కందిలో 42 మంది రైతుల నుంచి 3820 బస్తాలు, ఇంద్రకరణ్‌లో 53 మంది రైతుల నుంచి 5256 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బీగ్రేడ్‌కు రూ.2183 చెల్లిస్తున్నారు.

బ్యాలెట్ బాక్సులకు సీలు

నారాయణఖేడ్: ఎన్నికల సంఘం పార్లమెంటు ఎన్నికల్లో 85 ఏళ్లపైబడి వయస్సు గల వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. శుక్రవారం ఇంటి నుంచి ఓటు వేసే ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతోపాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకుంటారు. ఆయా వాటి కోసం జహీరాబాద్ పార్లమెంటు పరిధిలోని నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఎన్నికల అధికారులు బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసి ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆర్డీఓ అశోక చక్రవర్తి పర్యవేక్షణలో ప్రిసైడింగ్ అధికారి కళింగ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో బ్యాలెట్ బాక్సులకు సీలు వేశారు.

బీజేపీలో చేరిక

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని పలు తండాల గిరిజన నాయకులు, యువకులు బీజేపీ నాయకులు విజయ్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బీజేపీలో చేరిన వారిలో చున్నబట్టి, మందగుబ్బడి తండాకు చెందిన మాజీ వార్డు సభ్యులు రూపుసింగ్, హరిసింగ్, యువకులు అంబురాథోడ్, దేవిసింగ్, నాగిశెట్టి, గోవింద్, బబ్లు, హరిసింగ్, రాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సంతోష్, నాయకులు జగన్నాథ్, వీరారెడ్డి, ఉమేష్‌లాల్ పాల్గొన్నారు.

వృద్ధులకు హోం ఓటింగ్



వృద్ధురాలితో ఓటు వేయిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): ఎంపీ ఎన్నికల్లో భాగంగా 85ఏళ్లు నిండిన వృద్ధులకు హోం ఓటింగ్‌ను అధికారులు గురువారం నిర్వహించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో 85 ఏళ్లు ఉన్న 9మంది వృద్ధులను అధికారులు గుర్తించారు. మున్సిపల్ మేనేజర్ నిర్మల ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులు ఇళ్ల వద్దకు వెళ్లి వృద్ధులతో ఓటు వేయించారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

- కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



పటాన్‌చెరు: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ, చైతన్యనగర్ కాలనీలలో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటిని అమలు చేయడంలేదని దుయ్యబట్టారు. అనంతరం మహిళా విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి ప్రచారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీతరెడ్డి, మాజీ ఎంపీపీ గాయత్రి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి

పటాన్‌చెరు టౌన్: బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ ఆధ్వర్యంలోని మహిళా ప్రజాప్రతినిధులు, కార్యకర్తల బృందం గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీ, గౌతంనగర్ కాలనీ, సీతారామయ్యపురం కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి సతీమణి ప్రణీతరెడ్డి, పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, పటాన్‌చెరు మాజీ ఎంపీపీ గాయత్రి పాండు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్య నాయకులతో సమావేశం



జిన్నారం: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి నివాసంలో మున్సిపల్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ టీపీఆర్, మున్సిపల్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కాటా రాజుగౌడ్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా బొల్లారం మున్సిపల్ పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో పర్యటిస్తూ బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో...

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలలో గురువారం తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీతరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.

సంగారెడ్డిలో...

సంగారెడ్డి: మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా సంగారెడ్డి పట్టణంలోని 38వ వార్డులో బీఆర్‌ఎస్ యువ నాయకుడు శ్రావణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పాలనలో కోట్లాది రూపాయలతో సంగారెడ్డి పట్టణం అభివృద్ధి చెందిందని తెలిపారు. కార్యక్రమంలో గౌతమ్, సంతోష్, అన్వేష్ సందీప్‌రెడ్డి, శివ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి



రైతులతో మాట్లాడుతున్న భూసార నిపుణుడు స్వామి

ఝరాసంగం(జహీరాబాద్): రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని డీడీఎస్‌వీకే భూసార నిపుణుడు స్వామి అన్నారు. మండల పరిధిలోని ప్యారవరం గ్రామంలో భూసార పరీక్షలపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓ రైతు పొలంలో మట్టి నమూనాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని సూచించారు. భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రైతులు నర్సింలు, దశరథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా గురువారం పార్టీ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 12 తదితర వార్డుల్లో ఓటర్లను కలిశారు. బీఆర్‌ఎస్ నాయకులు షేక్ ఫరీద్, మోహినోద్దీన్, నామ రవికిరణ్ గుప్త, తంజీమ్, బరూర్ దత్తాత్రి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి మండల పరిధిలో...

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని హైద్లాపూర్, మేళసంగ్యం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు సాయికుమార్, శశికుమార్, మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్ పాల్గొన్నారు.

బీబీ పాటిల్‌ను గెలిపించండి

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీబీ పాటిల్ కోడలు వచనా పాటిల్ కోరారు. మండల కేంద్రమైన ఝరాసంగంలో బీబీ పాటిల్‌కు మద్దతుగా ఆమె మండల నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఎంపీటీసీలు రజిని ప్రియ సంతోష్ కుమార్ పాటిల్, విజయేందర్‌రెడ్డి, నాయకులు సంతోష్ కుమార్ పాటిల్, సుభాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వచనా పాటిల్

కాంగ్రెస్‌లో చేరికలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముర్తుజాపూర్, కాకిజన్‌వాడ తదితర గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రప్ప, భాస్కర్‌రెడ్డి, సిద్ధిలింగయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డి సమక్షంలో...

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్‌ఎస్‌కు చెందిన సదాశివపేట తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ పిల్లోడి జయమ్మ, అమె కుమారుడు, కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, మాజీ కౌన్సిలర్ వాజిద్ తమ అనుచరులతో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో పరివార్ దాబా వద్ద కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న జయమ్మ, అమె కుమారుడు విశ్వనాథం

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన ఖేడ్ మండలం పీర్లతండా పంచాయతీ పరిధిలోని కిందితండాలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రైతు నేనావత్ సోమ్లానాయక్ తన వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఎద్దును మేపుతున్నాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్‌వైర్‌కు అక్కడిక్కడే ఎద్దు మృత్యువాత పడింది. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు సోమ్లానాయక్ కోరాడు.

ఎల్గోయిలో పోలీసుల కవాతు



ఎల్గోయిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

ఝరాసంగం(జహీరాబాద్): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో జహీరాబాద్ డీఎస్పీ రామోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిఒక్కరూ నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు నయిమోద్దిన్, రాజు, ఎస్ఐలు రాజేందర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్ మండల పరిధిలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గుంజోటి, రేజింతల్ గ్రామాల్లో ఎన్నికల్లో భాగంగా ఆయా గ్రామాల్లో సాయంత్రం జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అధ్వర్యంలో సీఐ, ఎస్ఐలు, పోలీసులు ర్యాలీలు, కవాతు నిర్వహించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేయాలని డీఎస్పీ సూచించారు.

రోడ్ల మరమ్మతులు ఇప్పుడు గుర్తొచ్చాయా?



గుంతల్లో మట్టిని పోసి చదును చేస్తున్న సిబ్బంది

మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారుల తీరుపై కాంగ్రెస్ నాయకుల అసహనం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ఏళ్ల కాలం నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బొల్లారం ఎన్నికల ప్రచారానికి మాజీ మంత్రి హరీశ్‌రావు వస్తుండటంతో రోడ్లపై మట్టి పోయిస్తూ గురువారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గోపాలమ్మ, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రాములు మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి బీఆర్‌ఎస్‌కు చెందడంతోనే రోడ్ల మరమ్మతులు చేపట్టారని ఆరోపించారు.

ఎన్నికల సిబ్బందికి ముగిసిన శిక్షణ



నారాయణఖేడ్: ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి



జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఓలకు శిక్షణ ఇస్తున్న ఏఎల్‌ఎంటీలు

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా పీవో, ఏపీవో, ఓపీవోలుగా విధులు నిర్వర్తించే ఎన్నికల సిబ్బందికి నారాయణఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి, శిక్షణకు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్ ఎన్నికల విధులకు సంబంధించిఅంశాలపై అవగాహన కల్పించారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

జహీరాబాద్ టౌన్: లోకసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం కోసం ప్రిసైడింగ్(పీఓ)లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఆర్డీఓ ఆధ్వర్యంలో అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు 750 మంది పీఓలకు శిక్షణ ఇచ్చారు. మాక్‌పోల్ నిర్వహణ, ఈవీఎం యంత్రాల పనితీరు, బాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్లు కనెక్షన్లు వాటి పనితీరు, రిపేరు వస్తే తీసుకోవల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎల్‌ఓంటీలు తులసీరామ్ రాథోడ్, బాలయ్య, సంగమేశ్వర్, జైపాల్, జైసింగ్ చైహాన్, తుకారాం చవ్హాణ్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, బాగన్న, సంజీవ్ కుమార్, సూజాత్ అలీ, ఆనంద్, సురేష్, ముబిన్, సురేష్ 15 మంది కలిసి పీఓలకు శిక్షణ ఇచ్చారు.

ప్రతిఒక్కరికీ ప్రాధాన్యమిస్తాం



పార్టీలో చేరిన నాయకులతో నీలం మధు



రాళ్లకత్వలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌లో చేరే ప్రతిఒక్కరికీ ప్రాధాన్యం ఇస్తామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారానికి చెందిన బీజేపీ నాయకులు శివశంకర్, చక్రపాణి ఆ పార్టీకి రాజీనామా చేసి పలువురు యువకులతో కలిసి గురువారం నీలం మధు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ మెదక్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలన పట్ల ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు ముందుకు వస్తున్నారని వివరించారు. ఎంపీటీసీ జానాబాయి, నాయకులు మల్లేశం, ధర్మయ్య, నారబోయిన శ్రీనివాస్, రాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ముమ్మర ప్రచారం

జిన్నారం మండల పరిధిలోని రాళ్లకత్వ గ్రామంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా జిన్నారం మండల కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం పంట పొలాల వద్ద పనులు చేస్తున్న మహిళా రైతులను కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన



ఝరాసంగం: కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

నారాయణఖేడ్: అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాహుల్, ప్రియాంకగాంధీ యువమంచ్ జిల్లా వ్యవస్థాపకురాలు నాగలత అన్నారు. నారాయణఖేడ్‌లో గురువారం రిటైర్డ్ ఉద్యోగులైన సీనియర్ నాయకులు మల్లయ్య, అశోక్ తోర్నాల్, అక్తర్, జయరాములు, యాదయ్య, భాస్కర్, మహేష్‌కుమార్, నిజలింగప్ప, ప్రియాంక, మౌనిక, రేవంత్‌లతో కలిసి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఖేడ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో గ్యారంటీ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. సురేష్‌షెట్కార్ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సురేష్ షెట్కార్‌ను గెలిపించండి

జోగిపేట(అందోల్): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను ఓటు వేసి గెలిపించాలని జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య అన్నారు. జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, శివశంకర్, రంగ సురేష్, దుర్గేష్, చందర్‌నాయక్, కోఆప్షన్ సభ్యుడు శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ పిట్ల లక్ష్మణ్, శరత్‌బాబు, మాజీ చేనేత చైర్మన్ సత్యం, మాజీ ఎంపీటీసీ డాకూరి వెంకటేశం, నాయకులు ప్రవీణ్, ఖాజా, సతీష్, మధు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని భీంరా, నాగుర్(కే), నాగుర్(బీ) గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున ఖేడ్ మాజీ జెడ్పీటీసీ సంగీతజిత్తు షెట్కార్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతి గుర్తుకు ఓటు వేసి సురేష్‌షెట్కార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. నాయకులు పర్వతప్ప, కాశీనాథ్ పాటిల్, శివరాజ్, దిలీప్‌పాటిల్ పాల్గొన్నారు.

ఝరాసంగం మండల కేంద్రంలో...

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కప్పాడ్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మల్లప్పపాటిల్, యాదుల్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా హన్మంతరావు పాటిల్ మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఝరాసంగం పీఏసీఎస్ చైర్మన్ గౌసొద్దిన్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, సీనియర్ నాయకులు నందప్ప, వేణుగోపాల్‌రెడ్డి, మహేందర్, సుభాష్ పాల్గొన్నారు.



కంగ్టి: భీంరాలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న సంగీతజిత్తు షెట్కార్



జోగిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మాజీ మంత్రి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో...

కోహీర్(జహీరాబాద్): సుస్థిరమైన పాలన అందించే సత్తా కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని మాజీ మంత్రి, జహీరాబాద్ కాంగ్రెస్ ఎన్నిక ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి, నాయకులు మల్లన్నపాటిల్, అర్షద్ అలీ, శ్రీధర్‌రెడ్డి, అశోక్, రాచయ్య, వీరారెడ్డి పాల్గొన్నారు.

'గీతం'లో వేసవి శిబిరం

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని హాస్పిటాలిటీ విభాగం 6 నుంచి 12 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లల కోసం వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇది గీతంలో ఉద్యోగం చేస్తూ వేసవి సెలవుల కాలంలో పనిచేసే తల్లిదండ్రులకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేసవి శిబిరంలో క్రీడలు, కళలు, చేతిపనులు, సంగీతం, నృత్యం, పుస్తకపఠనం, చలనచిత్ర ప్రదర్శనతో సహా అనేక రకాల ఇండోర్, అవుట్ డోర్ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అదేవిధంగా పాఠశాల మూసివేత సమయంలో ఉద్యోగులు తమ పిల్లలను చూసుకోవడం సవాలుగా ఉంటుందని గుర్తించిన హాస్పిటాలిటీ విభాగం ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. ఆసక్తి ఉన్న గీతం ఉద్యోగులు, తమ పేర్ల నమోదు, ఇతరత్రా సమాచారం కోసం డైరెక్టర్ ఆఫ్ హాస్పిటాలిటీ, గీతంను సంప్రదించాలని సూచించారు.